సాక్షి
నాగర్‌కర్నూల్
మంగళవారం । 5 । ఆగస్టు । 2025



జూరాల గేట్ల మూసివేత

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు గేట్లను మూసివేశారు.

-8లో ▸



ముంపు నివారణకు నిధులు

జడ్చర్ల మున్సిపాలిటీలో వరద ముంపు ముప్పు నివారణ కోసం ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసింది.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.5 /22.1

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఎండ ప్రభావం చూపుతుంది.

రాజకీయ కలకలం



బీఆర్‌ఎస్ పార్టీలో ప్రకంపనలు

- కారు పార్టీకి గుడ్‌బై చెప్పిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- ఈ నెల 9న బీజేపీలో చేరే అవకాశం?
- ప్రచారంలో మరికొందరు మాజీ ఎమ్మెల్యేల పేర్లు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: బీఆర్‌ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీకి రాజీనామా చేయడం బీఆర్‌ఎస్‌లో ప్రకంపనలు సృష్టించింది. ఆయనతో పాటు మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారన్న ప్రచారం నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా తీవ్రంగా చర్చ సాగుతోంది. రెండు దశాబ్దాలుగా గులాబీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన గువ్వల పార్టీ వీడుతుండటంతో ఏం జరుగుతోందన్న ఆందోళన పార్టీ కేడర్‌లో నెలకొంది. ఈనెల 9న ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉందని, ఆయనతో పాటు మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు సైతం బీజేపీ గూటికి చేరుతారన్న ప్రచారం జరుగుతోంది.

అయోమయంలో పార్టీశ్రేణులు

గువ్వల బాలరాజు పార్టీకి రాజీనామా చేయడం, ఆయనతో పాటు మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు బీజేపీలో చేరనున్నారన్న ప్రచారం నేపథ్యంలో గులాబీ పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. అకస్మాత్తుగా గువ్వల రాజీనామా, పార్టీ మార్పు ప్రకటనతో పార్టీలో ఏం జరుగుతోందన్న అయోమయంలో పార్టీ శ్రేణులు ఉన్నారు. గువ్వల రాజీనామా క్రమంలో మిగతా నేతలు కూడా అదే బాటలో పడుతున్నారన్న ప్రచారం, వదంతుల నేపథ్యంలో పలువురు నేతలు స్పందించి పార్టీ మార్పు ప్రచారాన్ని ఖండిస్తున్నారు.



ప్రాధాన్యత లేదని..

బీఆర్‌ఎస్ పార్టీలో 2007లో చేరిన గువ్వల బాలరాజు మొదటి నుంచి క్రియాశీలకంగా ఉన్నారు. 2009లో మొదటిసారిగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్, టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. తర్వాత 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాక ప్రభుత్వ విప్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సీటు ఆశించినా భంగపాటు ఎదురైంది. ఈ సీటును ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు కేటాయించడంతో అసంతృప్తికి గురయ్యారు. పార్టీలో తనకు ప్రాధాన్యతను తగ్గిస్తున్నారని, పార్టీ అధినేత కేసీఆర్ తనను పట్టించుకోవడం లేదని అనుచరులతో చెబుతున్నారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ పొత్తు పెట్టుకుంటారని, వారి కన్నా ముందే తానే బీజేపీలో చేరుతున్నట్లు ముఖ్య అనుచరులతో స్పష్టం చేశారు.

చివరి శ్వాస వరకు బీఆర్‌ఎస్‌తోనే: మర్రి

తాను చివరి శ్వాస వరకు బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉంటానని, పార్టీ మారే ఆలోచన తనకు లేదని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్టు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గ దర్శకాలతో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు.

ఎప్పటికీ పార్టీ లైన్‌లోనే ఉంటా: జైపాల్‌యాదవ్

తాను ఎప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ లైన్‌లోనే ఉంటానని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గువ్వల నిర్ణయంతో తమకు సంబంధం లేదని చెప్పారు. తాను నిత్యం పార్టీ కార్యకర్తల నడుమ ఉంటున్నానని, బీఆర్‌ఎస్ పార్టీ కోసమే నిరంతరం పని చేస్తానని స్పష్టం చేశారు.

అబ్రహం దారెటు?

అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీజేపీలో చేరే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంపై ఆయన స్పందించలేదు. పార్టీ మార్పును ఇప్పటివరకు ధ్రువీకరించలేదు. అలంపూర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి సీటు దక్కలేదు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే కాంగ్రెస్‌లోనూ వర్గపోరు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే చర్చలు జరిగినట్టు చెబుతున్నా పార్టీ మార్పుపై ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆయన ముఖ్య అనుచరులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

ప్రజావాణికి 38 ఫిర్యాదులు



నాగర్‌కర్నూల్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అదనపు కలెక్టర్‌కు వినతులను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీదారుడు సమస్య పరిష్కారం కోసం తిరిగి అదే సమస్య విన్నవించకుండా జిల్లా అధికారులు ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ప్రజావాణికి 38 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, ఆయా విభాగాల సూపరింటెండెంట్లు రవికుమార్, వెంకట్, శోభ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 10..



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషిచేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పోలీస్ గ్రీవెన్స్‌కు మొత్తం 10 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 8 భూ తగాదా, 2 న్యాయం చేయాలని ఫిర్యాదులు ఉన్నాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బల్మూర్: మండలంలోని ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ బోధించడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వరంగి రవి సోమవారం ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ జనరల్, ఓబీసీ అభ్యర్థులు 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో నేరుగా వచ్చి తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూ నిర్వహించి అదే రోజు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

కందనూలు: జిల్లాకేంద్రంలోని నేషనల్ ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి, శిక్షణ శాఖాధికారి రాఘవేంద్రసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో వివిధ కేటగిరీల్లో వంద ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని యువతీ, యువకులు 10వ తరగతి, డిగ్రీ, ఫార్మసీ, పాసై 18–35 ఏళ్లలోపు నిరుద్యోగులు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నం.97012 00819 సంప్రదించాలని కోరారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్: జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండీ ఫయాజ్ డిమాండ్ చేశారు. సోమవారం కొల్లాపూర్‌లోని కేఎల్‌ఐ అతిథి గృహంలో నిర్వహించిన సీపీఐ పార్టీ మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొల్లాపూర్ పట్టణానికి చెందిన ఫయాజ్ ఇటీవలే సీపీఐ జిల్లా కార్యదర్శిగా నియామకం కావడంతో ఆయనను పార్టీ నాయకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఫయాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నాగర్‌కర్నూల్‌లో వేలాదిగా లంబాడీలు, చెంచులు ఉన్నారన్నారు. వారి జనాభా ఆధారంగా జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. నల్లమలలోని వనరులను వినియోగించుకునే విధంగా పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. నల్లమల పరిసర ప్రాంతాలను ఏజెన్సీ కారిడార్‌గా ప్రకటించాలని కోరారు. కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్, ఫిష్ ప్రాసెసింగ్ సెంటర్ స్థాపించాలన్నారు. మొలచింతలపల్లి, అసద్‌పూర్ శివార్లలో ఉన్న రాజవంశస్థుల భూములను సీలింగ్ యాక్టు ప్రకారం పేదలకు పంచాలని ఆయన కోరారు. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు శివుడు, ఇందిర, యూసుఫ్, కుర్మయ్య, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టమైనవి



గర్భిణులకు నవజాత కిట్లు అందజేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా

నాగర్‌కర్నూల్ క్రైం: శిశువు పుట్టిన వెంటనే తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు పట్టడం వల్ల శిశువులో రోగ నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి గైనిక్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలతోపాటు రీహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టమైనవని, పుట్టిన శిశువు నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లులకు అండాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటివి వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బులు దరిచేరవన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వ్యక్తులు, మానసిక రోగులుగా మారిన వారికి జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రిహాబిలిటేషన్ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నియంత్రణ కోసం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి, గైనిక్ హెచ్‌ఓడీ నీలిమ, వైద్యులు సుప్రియ, సౌమ్య, కవిత, రవిశంకర్, అంబుజ, హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జ్ యాదగిరి పాల్గొన్నారు.

నేటి నుంచి పబ్బతి అంజన్న పవిత్రోత్సవాలు

అమ్రాబాద్: మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 5న ఉదయం 10గంటల నుంచి మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షారాధన, వాస్తు శాంతి, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6గంటల నుంచి యాగశాల ప్రవేశం, అంకురార్పణ, యాగశాలలో కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 6న గవ్యాంతర పూజలు, వేదికార్చన, మండలార్చన, యాగశాలలో పట్టు పవిత్రాల అలంకరణ, మూలమంత్ర హోమాలు, నంపాత హోమం, లఘు పూర్ణాహుతి, 7న గవ్యాంతర పూజలు, యాగశాలలో కలశ దేవతలకు ఆరాధన, మూలమంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, కుంభములతో ఆలయ ప్రవేశం, స్వామివారికి కుంభ జలాలతో అభిషేకం, విశేష ఆరాధన, పట్టు పవిత్ర సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



పబ్బతి ఆంజనేయస్వామి మూలవిరాట్

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



ఓ ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 3,489 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ఈసారి జిల్లాలో సాగు విస్తీర్ణం 5 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశం ఉన్నందున అదనపు ఎరువులు కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ కార్యాలయానికి నివేదిక పంపిస్తామన్నారు. గతేడాది ఆగస్టులో 8,500 టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామని, ఈసారి 10 వేల టన్నుల ఎరువులు అవసరం కావొచ్చని అభిప్రాయపడ్డారు. డీలర్లు రైతులకు ఎమ్మార్పీకి మించి ఎరువులు అమ్మినా, యూరియాకు వేరే ఎరువులు లింక్ చేసి అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించాలని చూసినా కేసులు నమోదు చేసి, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కందనూలు: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో బంగారు, వెండి పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు సోమవారం తెలిపారు. సౌత్ జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–18 బాలుర విభాగంలో ఉదయ్‌కిరణ్ హైజంప్ సిల్వర్ మెడల్, అండర్–20 బాలుర విభాగంలో కాట్రావత్ శ్రీను గోల్డ్ మెడల్, ఉమెన్ విభాగంలో కొడావత్ స్వప్న స్టీపుల్ చేజ్‌లో గోల్డ్ మెడల్, చైతన్య సిల్వర్ మెడల్, రాజేశ్వరి గోల్డ్ మెడల్ సాధించారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం పట్ల అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌యాదవ్, క్రీడాకారుల తల్లిదండ్రులు, మాజీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి



ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ జెడ్పీటీసీ రాంబాబునాయక్ తదితరులు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. గతంలో నల్లమల పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి రూ.100 కోట్లకు సంబంధించి ప్రతిపాదనలు అందించామని, మరోసారి సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు మున్సిపల్ చైర్మన్ వివరించారు. నిధులు మంజూరు కాగానే పట్టణంలో అవసరం ఉన్న చోట అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, సీసీరోడ్లతోపాటు వివిధ అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుంచుతున్నామని, భవిష్యత్‌లోనూ మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు

అమ్రాబాద్: బీఆర్‌ఎస్ నేత, పదర జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంబాబునాయక్ సోమవారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాంబాబునాయక్‌తోపాటు బీఆర్‌ఎస్ కార్యకర్తలు నర్సింహ, వెంకటయ్య, రామ్మూర్తి తదితరులున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో అచ్చంపేట ఎమ్మెల్యే వాంగ్మూలం

అచ్చంపేట రూరల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులతోపాటు ముఖ్య నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేశారన్న ఆరోపణల విషయంలో సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు విచారణకు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఫోన్లు ట్యాపింగ్‌కు అయినట్లు కొందరు సిట్ ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేసి ఎన్నికల సమయంలో లబ్ధి పొందాలని చూశారని ఆరోపించారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా బీఆర్‌ఎస్ ప్రజల ముందు ఓడిపోయిందన్నారు.

మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ సస్పెండ్

కందనూలు: జిల్లాకేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో అడ్మిషన్ పేరుతో వసూళ్ల దందాకు పాల్పడిన ఇద్దరు సిబ్బందిని విధుల్లో నుంచి తొలగించగా పర్యవేక్షణ లోపంతోపాటు వసూళ్ల దందాలో కూడా వాటాలు ఉన్నట్లు అనుమానిస్తూ అధికారులు పాఠశాల ప్రిన్సిపాల్ సుంకన్నకు మెమో జారీ చేశారు. మరింత లోతుగా విచారించిన అధికారులు సోమవారం సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాల కార్యదర్శి షఫీఉల్లా ఉత్తర్వులు జారీ చేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కరీంను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నియమించారు.

మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలు, విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100, సెల్ నం.87126 57676కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేస్తే తక్షణ సహాయం అందుతుందన్నారు. అలాగే ప్రతిఒక్కరు కచ్చితంగా టీ సేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా షీటీం జూలైలో 5 కేసులు నమోదు చేయడంతోపాటు 28 అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు. మహిళలు, విద్యార్థులు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగాం వినియోగంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు.

ఫలించిన ఆపరేషన్ ముస్కాన్

- జూలై 1 నుంచి 31 వరకు కొనసాగిన ప్రత్యేక తనిఖీలు
- జిల్లాలో 33 మంది బాల కార్మికులకు విముక్తి
- 27 మంది యజమానులపై కేసులు నమోదు
- విముక్తి పొందిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించిన అధికారులు



నాగర్‌కర్నూల్: వివిధ కారణాలతో చదువులు మానేసి బాలకార్మికులుగా మారిన పిల్లల జీవితాల్లో ఆపరేషన్ ముస్కాన్ వెలుగులు నింపుతోంది. హోటళ్లు, వస్త్ర, కిరాణ దుకాణాలు, ఇటుక బట్టీలు, మెకానిక్ షెడ్లలో పనులు చేస్తున్న బాలకార్మికులను గుర్తించి వారిని వెట్టి నుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ అనే కార్యక్రమాలను చేపట్టింది. జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రభుత్వం ఈ కార్యక్రమాలను కొనసాగిస్తుంది. మహిళా, శిశు సంక్షేమం, పోలీస్, కార్మిక శాఖ, చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతారు. ఈ క్రమంలోనే గత నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 33 మంది బాలకార్మికులకు వెట్టి నుంచి విముక్తి కలిగించి సదరు పిల్లలను వారి పరిధిలోని పాఠశాలల్లో చేర్పించారు. అలాగే వీరిని పనిలో పెట్టుకున్న 27 మంది యజమానులపై కేసులు నమోదు చేశారు.

ఇప్పటి వరకు 591 మంది..

ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ కార్యక్రమాలు 2014లో ప్రారంభమైనా నాగర్‌కర్నూల్ జిల్లాగా ఏర్పడిన తర్వాత 2018 జనవరి నుంచి నిర్వహించారు. ఈ క్రమంలో 2018 నుంచి 2025 జూన్ వరకు గడిచిన ఎనిమిదేళ్లలో జిల్లాలో 591 మంది బాలకార్మికులను గుర్తించి వారిని వివిధ పాఠశాలల్లో చేర్పించారు. 2018 జనవరిలో 23, జూలైలో 76, 2019 జనవరిలో 29, జూలైలో 46, 2020 జనవరిలో 104, 2021 జనవరిలో 48 మంది బాలకార్మికులను గుర్తించి వెట్టి నుంచి విముక్తి కల్పించారు. 2020, 2021 జూలైలో కరోనా ప్రభావంతో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహించలేదు. ఆ తర్వాత 2022 జనవరిలో 34, 2022 జూలైలో 23, 2023 జనవరిలో 16, 2023 జూలైలో 18, 2024 జనవరిలో 10, 2024 జూలైలో 23 మంది, 2025 జనవరిలో 108, 2025 జూలైలో 33 మందికి విముక్తి కల్పించారు. 2018 నుంచి బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై అధికారులు లేబర్ యాక్ట్ కింద కేసులు కూడా నమోదు చేశారు.

మూడు టీంల ఏర్పాటు..

జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కోసం జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించేందుకు మొత్తం మూడు టీంలను ఏర్పాటు చేశారు. అచ్చంపేటకు ఒక టీం, కల్వకుర్తికి ఒక టీం, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్‌కు కలిపి ఒక టీం ఏర్పాటు చేశారు. మొత్తం నెలరోజులపాటు నిర్వహించిన ఈ తనిఖీల్లో 33 మంది పిల్లలను కాపాడారు. కాగా.. పిల్లలతోని పని చేయిస్తున్న యజమానులపైనే 27 మందిపై కేసులు నమోదు చేయగా మిగతా వారికి జరిమానాలు విధించినట్లు అధికారులు చెబుతున్నారు.

పాఠశాలలకు పంపించాం..



ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గుర్తించిన 33 బాలకార్మికులను సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాం. అంతేకాకుండా వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాం. వీరిని పనిలో పెట్టుకున్న 27 మంది యజమానులపై కేసులు నమోదు చేశాం. 18లోపు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. – శ్రీశైలం, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక వివాహిత బలవన్మరణం

ఖిల్లాఘనపురం: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని మానాజీపేటకు చెందిన ఉప్పరిపల్లి రూప (25)కు ఏడేళ్ల క్రితం మామిడిమాడకు చెందిన మెడమోని రవితో వివాహం జరిగింది. అయితే రెండేళ్లుగా రూపకు తరచుగా కడుపునొప్పి వచ్చేది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పటికీ తగ్గలేదు. ఆదివారం మధ్యాహ్నం మరోసారి కడుపునొప్పి రావడంతో విషయాన్ని భర్త రవికి చెప్పగా.. తాను గొర్రెల మంద వద్దకు వెళ్లి వచ్చాక ఆస్పత్రికి వెళ్దామని చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో కడుపునొప్పి భరించలేక ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు మృతురాలి తల్లి ఉప్పరిపల్లి మంజుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ జె.నరేశ్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంతానం కలగడంలేదని.. వ్యక్తి ఆత్మహత్య


హరిజన పుల్లన్న (ఫైల్)

ఎర్రవల్లి: ఓవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు సంతానం కలగకపోవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రవి వివరాల మేరకు.. ఇటిక్యాల మండలం షాబాద్‌కు చెందిన హరిజన పుల్లన్న (40) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో పాటు పెళ్లి జరిగి 20 ఏళ్లయినా పిల్లలు పుట్టకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా.. పరిస్థితి విషమించి మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంగనూర్‌లో మరొకరు..

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌కు చెందిన బత్తుల శ్రీశైలం (45) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. మంగనూర్‌కు చెందిన శ్రీశైలం సోమవారం తెల్లవారుజామున ఇంటి నుంచి పొలానికి వెళ్లాడు. అక్కడి నుంచి గ్రామ సమీపంలో ఫెన్సింగ్ చేసిన కడీల వద్దకు చేరుకొని ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో తనువు చాలించిన వ్యక్తి

దామరగిద్ద: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దామరగిద్ద మండలం యల్సాన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు వివరాల మేరకు.. యల్సాన్‌పల్లికి చెందిన తోడేళ్ల చిన్నసాయిలు (42) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాలు ఏర్పడటంతో ఆదివారం రాత్రి తన పొలంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే నారాయణపేట ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామాలయంలో వెండి కిరీటాలు చోరీ

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు రామాలయంలో వెండి కిరీటాలు చోరీకి గురయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి వివరాల మేరకు.. శనివారం అర్ధరాత్రి రామాలయానికి ఉన్న తాళాలను పగులగొట్టి సీతారామలక్ష్మణ విగ్రహాలకు ధరింపజేసిన వెండి కిరీటాలను చోరీ చేశారు. ఆదివారం రాత్రి భజన చేయడానికి వెళ్లిన గ్రామస్తులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి ఆలయానికి చేరుకొని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూరాల కుడి కాల్వలో వ్యక్తి గల్లంతు

గద్వాల క్రైం: జూరాల కుడి కాల్వలో పడి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన పెంచల్లయ్య నాటుమందుల విక్రయించేందుకు నెలరోజుల క్రితం గద్వాలకు వచ్చారు. గద్వాల–బీరోలు మార్గంలో తాత్కాలికంగా గుడిసె ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులతో కలసి అతడు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గుడిసె సమపంలోని జూరాల కుడి కాల్వలో స్నానం చేసేందుకు వెళ్లిన అతడు.. ప్రమాదవశాత్తు కాల్వలో పడి గల్లంతయ్యాడు. స్థానికులు గుర్తించి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న డీఎస్పీ మొగిలయ్య, ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. కాల్వలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఆచూకీ లభించలేదు. నీటి ప్రవాహం నిలుపుదల కోసం పోలీసులు జూరాల ప్రాజెక్టు అధికారులకు సమాచారం అందించారు.

వరద ముంపు నివారణకు నిధులు


వర్షపునీటితో చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి (ఫైల్)

- గతేడాది టీయూఎఫ్‌ఐడీసీ నుంచి రూ. 14కోట్లు మంజూరు
- తాజాగా మరో రూ. 3కోట్లు విడుదలచేసిన ప్రభుత్వం
- త్వరలోనే పనులు ప్రారంభం



జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపాలిటీలో వరద ముంపు ముప్పు నివారణ దిశగా అడుగులు పడుతున్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరయ్యాయి. గతేడాది టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రూ. 14కోట్లు మంజూరు కాగా.. తాజాగా మరో రూ. 3కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం రూ. 17కోట్లతో చేపట్టే వరద ముంపు నివారణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి.

18 కాల్వల నిర్మాణానికి చర్యలు..

మున్సిపాలిటీలో వరద ముంపు ముప్పును ఎదుర్కొనేందుకు మొత్తం 18 కాల్వలు నిర్మించనున్నారు. తొలి విడతలో మంజూరైన రూ. 14కోట్లతో 10 కాల్వలు, తాజాగా మంజూరైన రూ. 3కోట్లతో 8 కాల్వల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవానికి గతేడాది మంజూరైన నిధులకు సంబంధించి సింగిల్ టెండర్ కారణంగా ఈఎన్‌సీ అధికారులు పెండింగ్‌లో ఉంచారు. టెండరు వేసిన సంస్థ గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాత ఖారారు చేసినట్లు తెలిసింది. వాటితో పాటు అదనంగా కేటాయించిన నిధులకు సైతం టెండరు ప్రక్రియ పూర్తికావొచ్చింది. 18 కాల్వలు నిర్మాణాలు పూర్తయితే మున్సిపాలిటీలో వరదముంపు సమస్య పూర్తిగా తొలగనుంది.

త్వరలోనే పనులు..



మున్సిపాలిటీలో వరద ముంపును ఎదుర్కొనేందుకు అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. వీటి ద్వారా మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 18 కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభమవుతాయి.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

ఎమ్మెల్యే కృషితో నిధులు..



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కృషితో రూ. 17కోట్లు మంజూరయ్యాయి. వీటితో మున్సిపాలిటీ పరిధిలో వరద ముంపు నివారణ కోసం శాశ్వత పనులు చేపడతాం. పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

– కోనేటి పుష్పలత, మున్సిపల్ చైర్‌పర్సన్, జడ్చర్ల

భవిష్యత్‌లో హిందూ చైతన్యయాత్రలు

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్, చిత్రంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: భవిష్యత్‌లో హిందూ చైతన్యయాత్రలు చేపడతానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. సోమవారం శ్రీశైలం, మహానంది యాత్రను ముగించుకొని హైదరాబాద్ వెళ్తున్న ఆయన.. ఉండవెల్లి మండలంలోని టోల్‌ప్లాజా వద్ద ఆగి కొంతసేపు సేద తీరారు. అక్కడే ఉన్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రాజాసింగ్‌ను కలిశారు. ఇద్దరు ఎమ్మెల్యేలు ఓ హోటల్‌లో టీ తాగి తాజా రాజకీయాలపై చర్చించారు. ఇదిలా ఉంటే, బీజేపీకి రాజీనామా చేశారు కదా.. భవిష్యత్ కార్యాచరణ ఏమిటని స్థానిక విలేకరులు రాజాసింగ్‌ను ప్రశ్నించగా.. తాను తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే ఆకాంక్షతో పనిచేసినట్లు తెలిపారు. కానీ పార్టీలో ఉన్న కొందరు నేతలు ఇతర పార్టీలకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో హిందూ చైతన్యయాత్ర చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, లోకారెడ్డి, కృష్ణగౌడ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జూరాల క్రస్టుగేట్లు మూసివేత

- ప్రాజెక్టుకు 49వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 415.797 ఎం.యూ. విద్యుదుత్పత్తి


మూసివేసిన జూరాల గేట్లు

ధరూరు/ఆత్మకూర్/రాజోళి/దోమలపెంట/మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో క్రస్టు గేట్లను మూసివేశారు. కేవలం విద్యుదుత్పత్తికి సరిపడా నీరు మాత్రమే దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 1.08లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం రాత్రి 8:30 గంటల వరకు 49వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 37,220, కోయిల్ సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 1,080, కుడి కాల్వకు 690 క్యూసెక్కులతో కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 40,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 8.434 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉంటే, ఆల్మట్టి ప్రాజెక్టుకు 55,305 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 11వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 15,372 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

■ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి లక్ష్యం దిశగా పరుగులు పెడుతోంది. ఈ ఏడాది 610 ఎం.యూ. టార్గెట్ కాగా.. ఇప్పటికే 415 మి.యూ. ఉత్పత్తి సాధించారు. సోమవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్లలో 195 మెగావాట్లు, 189.428 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 226.363 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు పేర్కొన్నారు.

– సుంకేసుల డ్యాంకు స్వల్పంగా ఇన్‌ఫ్లో నమోదైంది. ఎగువ నుంచి 18వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నాలుగు గేట్లను 1 మీటర్ మేర తెరిచి 17,784 క్యూసెక్కులను దిగువకు వదిలారు. కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కుల నీరు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

■ శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగులకు నీటిమట్టం చేరింది. ఎగువ నుంచి 55,004 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 30.902 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 35,000, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 3,225, ఎంజీకేఎల్‌ఐకి 2,152 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో 17.028 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.531 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టారు.

■ రామన్‌పాడు జలాశయంలో 1,021 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,250, సమాంతర కాల్వ ద్వారా 145 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రామన్‌పాడు ప్రాజెక్టు నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875, కుడి, ఎడమ కాల్వలకు 45, వివిధ లిఫ్టులకు 255, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

భార్య మృతికి కారణమైన భర్తకు ఆరేళ్ల జైలుశిక్ష

వీపనగండ్ల: కట్టుకున్న భార్యను వేధింపులకు గురిచేసి ఆమె మరణానికి కారణమైన భర్తకు ఆరేళ్ల జైలుశిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయమూర్తి సునీత తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ కె.రాణి వివరాల మేరకు.. వీపనగండ్లకు చెందిన దయ్యపు శివ తన భార్య శివమ్మను వేధింపులకు గురిచేయడంతో ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు భర్త శివపై పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా సబ్‌కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో గతేడాది ఫిబ్రవరిలో శివకు ఆరేళ్ల జైలుశిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అయితే నిందితుడు జిల్లా కోర్టును ఆశ్రయించాడు. జిల్లా కోర్టులో వాదోపవాదాల అనంతరం కింది కోర్టు విధించిన శిక్షను ఖరారు చేస్తూ జిల్లా కోర్టు జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ రాణి, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ తెలిపారు.

హత్య కేసులో పదేళ్ల జైలుశిక్ష

నారాయణపేట క్రైం: పాత కక్షలతో ఓ వ్యక్తిని హతమార్చిన నేరస్తుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ. 10వేల జరిచానా విధిస్తూ సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ ట్రయల్ కోర్టు జడ్జి వి.శారదాదేవి తీర్పు వెల్లడించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ వివరాల మేరకు.. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో 2024 ఏప్రిల్ 5న గుర్తుతెలియని వ్యక్తిని హత్యచేసి కాల్చి వేశారన్న సమాచారంతో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ క్రమంలో స్థానిక పళ్లబుర్జుకు చెందిన దాసరి నారాయణ అక్కడికి చేరుకొని హత్యకు గురైన వ్యక్తి తన తమ్ముడు దాసరి మారుతి (39)గా గుర్తించారు. అతడు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ.. అప్పుడప్పుడు నారాయణపేటకు వస్తుండే వాడని.. హత్యకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు.. ఉప్పరి నరసింహులు అలియాస్ నజీర్ (30) అనే వ్యక్తి పాత కక్షలతో దాసరి మారుతిని హతమార్చి నిప్పంటించినట్లు గుర్తించారు. ఈ మేరకు కోర్టులో చార్జిషీట్ నమోదు చేయగా.. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ హెచ్‌సీ సురేందర్‌గౌడ్, హెచ్‌జీ విజయ్ కుమార్, సీడీఓ సురేశ్‌కుమార్ సాక్షులను ప్రవేశ పెట్టగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్‌హెచ్ రాజేశ్వరరావు వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో నేరస్తుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్పీ తెలిపారు.

గిజిగాడి పొదరిల్లు.. కనువిందు


ఈత చెట్లపై గిజిగాడి గూళ్లు

చెట్టు కొమ్మను పునాదిగా చేసి.. వేలాది గడ్డి పోచలను ఒకదానికొకటి అల్లుతూ.. ఎంతో కళాత్మకంగా.. మరెంతో నైపుణ్యంతో.. నేటి కంప్యూటర్ యుగంలోనూ ఏ ఇంజినీర్‌కు తీసిపోని రీతిలో.. కొన్ని రోజుల పాటు రెక్కలవిసేలా శ్రమించి నిర్మిస్తుంది గిజిగాడి గూడు. గద్వాల పట్టణంలోని నదీ అగ్రహారం రోడ్డు మార్గంలోని వ్యవసాయ పంట పొలంలో ఈత చెట్టు కొమ్మలకు వేలాడుతున్న వందలాది గిజిగాడి గూళ్లు.. అపార్ట్‌మెంట్లను తలపిస్తూ కనువిందు చేస్తున్నాయి. ఈ దృశ్యాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– గద్వాల క్రైం


బావి పక్కనే ఏర్పాటు చేసుకున్న పక్షుల గూళ్లు

నార్త్‌డాం యూనివర్సిటీతో ఎంఓయూ

పీయూలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం


నార్త్‌డాం యూనివర్సిటీ ప్రతినిధులతో ఎంఓయూ కుదుర్చుకుంటున్న పీయూ అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ అధికారులు అమెరికాలోని గ్లోబల్ సెంటర్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్‌డైల్డ్, నార్త్‌డాం యూనివర్సిటీతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ మేరకు పీయూలో వారం రోజులపాటు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంఓయూ ద్వారా ఉన్నత విద్య మెరుగుపడాలన్నారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు అందిస్తున్న బోధనలో సైతం మార్పు రావాల్సిన అవసరముందన్నారు. భావోద్వేగ, మానసిక శ్రేయస్సు, సానుభూతి వంటి మానసిక అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. విద్యావేత్తలు భవిష్యత్‌లో రాబోయే విద్యార్థులను సామాజిక స్పృహ ఉన్న వ్యక్తులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రపంచస్థాయి విద్యా సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకోవడం ద్వారా పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు రుబీనా ఫిలిప్, కరుణాకర్‌రెడ్డి, జయనాయక్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హైజెనిక్ ఫుడ్ అందించాలి


రాజాపూర్ కేజీబీవీలో విద్యార్థిని అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ వెంకటనర్సమ్మ

రాజాపూర్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు హైజెనిక్ ఫుడ్ అందించాలని ఆర్‌జేడీ వెంకటనర్సమ్మ ఆదేశించారు. సోమవారం రాజాపూర్‌లోని కేజీబీవీ, ఉన్నత పాఠశాలతో పాటు భవిత కేంద్రంలో ఆర్‌జేడీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా కేజీబీవీలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనంతో పాటు తరగతి గదులు, వంటగదిని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కూరగాయల విషయంలో నాణ్యత పాటించాలని ప్రిన్సిపాల్ లక్ష్మీబాయికి సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న భవిత కేంద్రాన్ని పరిశీలించారు. భవిత కేంద్రం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐఈఆర్పీ ప్రాణేశ్‌ను సస్పెన్షన్ చేయాలని ఎంఈఓ సుధాకర్‌ను ఆదేశించారు. అనంతరం ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు టీఎల్‌ఎం ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్‌జేడీ వెంట జడ్చర్ల ఎంఈఓ మంజులాదేవి ఉన్నారు.

మార్కెట్‌లోకి రెనాల్ట్ ట్రైబర్ కారు


కారును ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిరణ్, ట్రెండ్ గ్రూప్ చైర్మన్ గట్టు గోపాల్‌రెడ్డి

పాలమూరు: రెనాల్ట్ ట్రైబర్ కంపెనీకి చెందిన ట్రైబర్ ఎంపీవీ న్యూ మోడల్ కారును సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని షోరూంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిరణ్, ట్రెండ్ గ్రూప్ చైర్మన్ గట్టు గోపాల్‌రెడ్డి నూతన కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రెనాల్ట్ ట్రైబర్ న్యూ మోడల్ కారులో సరికొత్తగా 21 స్టాండర్డ్ ఫీచర్లతో ఆరు ఎయిర్ బ్యాగ్స్‌తో పాటు క్రూజ్ కంట్రోల్ సిస్టమ్ వంటి ఫీచర్స్ ఉన్నాయని తెలిపారు. 5నుంచి 7సీట్లు 625 బూట్ స్పెస్, ఎల్‌ఈడీ టెక్నాలజీ హెడ్ లైట్స్, మూడు రంగుల్లో పెట్రోల్ వెర్షన్‌లో కారు అందుబాటులో ఉందన్నారు. లీటర్ పెట్రోల్ 19 కి.మీ. మైలేజ్ ఇస్తుందని, ఎక్స్‌షోరూం ధర రూ. 8లక్షల 64వేలు అని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ గట్టు సిరిచందనరెడ్డి, కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ మాధురి, సిబ్బంది ఆనంద్, శ్రీశైలం, సందీప్ పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

బల్మూర్: మండలంలోని మైలారంలో వారం రోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన దొంగను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ వెల్లడించారు. ఆయన వివరాల మేరకు.. గత నెల 27న మైలారం గ్రామానికి చెందిన ఇందిరమ్మ తన ఇంటికి తాళంవేసి వ్యవసాయ పొలానికి వెళ్లగా.. తాళాన్ని పగులగొట్టి ఇంట్లో ఉన్న తులం బంగారు గొలుసుతో పాటు 20 తులాల వెండి వస్తువులు, రూ. 30వేల నగదు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా.. అదే గ్రామానికి చెందిన కటికర్ల ఆంజనేయులు అనే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు తేలింది. అతడిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించడంతో చేసిన చోరీని ఒప్పుకొన్నాడు. దొంగతనం చేసిన సొమ్మును రికవరీ చేసి.. నిందితుడిని అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసును ఛేదించిన కానిస్టేబుల్ ప్రవీణ్, బీముడు, ఆంజనేయులును ఎస్‌ఐ అభినందించారు.

లీగ్ మ్యాచ్‌లో జిల్లా బౌలర్ల ప్రతిభ


జస్వంత్ (5 వికెట్లు)


ఎండీ ముఖితుద్దీన్ (4 వికెట్లు)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో సోమవారం జరిగిన బీ–డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లా బౌలర్లు ప్రతిభ చాటారు. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ బ్లూస్ జట్టు జిల్లా బౌలర్ల ధాటికి 54.1 ఓవర్లలో 195 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో హర్షిల్‌రెడ్డి 56 పరుగులు చేశాడు. మహబూబ్‌నగర్ బౌలర్లు జస్వంత్ 13.1 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి 5 వికెట్లు, ఎండీ ముఖితుద్దీన్ 17 ఓవర్లలో 53 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 22 పరుగులు చేసింది. మంగళవారం రెండో రోజు మ్యాచ్ కొనసాగనుంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని నాగనూలుకు చెందిన నర్సింహ (56) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. గతనెల 29న నర్సింహ తన వ్యవసాయ పొలంలో బోరుమోటారు ఆన్ చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి రెఫర్ చేయగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రాణం తీసిన చేపలవేట

తాడూరు: చేపలవేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన తాడూరు మండలం గోవిందాయపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గోవిందాయపల్లికి చెందిన తెలుగు రామస్వామి (35) గ్రామ సమీపంలోని పెరుమాళ్లకుంటలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో చేపల కోసం వల వేసే క్రమంలో కాలుకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని అతడి మృతదేహాన్ని చెరువులో నుంచి బయటికి తీశారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆటోడ్రైవర్ ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన కృష్ణ (25) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. అతడికి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.